
ప్రజాశక్తి

ఆదివారం 15 జూన్ 2025

5

విజయనగరం



17న అండర్ -16 క్రికెట్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న అండర్ -16 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి. సీతారామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం శివారు విజ్జి క్రికెట్ మైదానంలో మంగళవారం ఉదయం 7.30గంటలకు జరిగే ఈ ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2009 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే వారు ఒరిజినల్ ఆధార్ కార్డ్, జన్మ ధ్రువీకరణ పత్రం, మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్స్ తీసుకు రావాలన్నారు. క్రీడాకారులు వైట్ డ్రెస్, సొంత కిట్టుతో హాజరు కావాలని ఆయన కోరారు.



గజపతినగరం మండలం పాతబగ్గాం ఎరుకులపేటలో పెచ్చులూడుతున్న పాఠశాల శ్లాబ్



వేపాడ మండలం బంగారయ్య పేటలో శిథిలావస్థకు చేరిన ఎంపిపి పాఠశాల

పిల్లల చక్కని చదువుకు నెలవై.. వారి బంగారు భవితకు బాటలు వేసే గుడి లాంటి బడి సమస్యల సాలెగూడుగా మారిపోయింది. బడి పాడుబడిపోయి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మరింత శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు పెచ్చులూడి.. గోడలు కూలి మీద పడతాయోనన్న ఆందోళన నెలకొంది. తరగతి గదిలో పిల్లలు సౌకర్యవంతంగా కూర్చునే పరిస్థితే లేదు. ఊచల్లేని.. తలుపుల్లేని కిటికీల్లోంచి వచ్చే చినుకులతో నేలంతా చిత్తడే. పోనీ.. ఆ తడిని తుడిచేసి ఎలాగోలా కూర్చున్నా అనుక్షణం భయం భయంగా గడపాల్సిన దైన్యం.. పాడుబడిన పైకప్పు నుంచి పెచ్చులూడి నెత్తిమీద పడతాయేమోనని వణుకు.. వానకు జాలుపట్టి ఉబ్బిపోయిన పాత గోడలు కూలిపోతాయేమోనని ఆందోళన. ప్రాంగణంలో అడుగు పెట్టాలంటే వణుకు పుట్టేలా బురద.. వరద నీరు చేరి కొలనును తలపించేలా పాఠశాల.. అలా అని నేలపైనే చదువులు... ఇలా చెప్పుకుంటూ పోతే పాఠశాల మొత్తం సమస్యలే. ఇలాంటి పాఠశాలల్లో బిక్కుబిక్కుమంటూ భావిభారత పౌరులు విద్యనభ్యసిస్తున్నారు.

- శిథిల భవనాల్లోనే చదువులు
- ప్రతిపాదనలకే పరిమితమైన నూతన భవనాలు
- బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు
- పిల్లలను పాఠశాలకు పంపించాలంటే హడలెత్తిపోతున్న తల్లిదండ్రులు

పాడుబడింది

కొత్త భవనం ఏర్పాటుచేయాలి



మా గ్రామంలో పాఠశాల శిథిలావస్థకు చేరిందని గత ప్రభుత్వంలో పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లినా ప్రయోజనం లేకపోయింది. ఏడాది క్రితం వచ్చిన కూటమి ప్రభుత్వం స్కూల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రభుత్వ స్కూల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలని చెప్పడంతో స్థానిక ప్రజాప్రతినిధులను, అధికారులను కలిసి స్కూల్ సమస్యలను వివరించాం. వెంటనే పరిష్కార దిశగా అడుగులు వేయాలి.

– లెంక పద్మావతి, సర్పంచ్, పాతబగ్గాం, గజపతినగరం మండలం



పెచ్చులూడుతున్న భవనంలో బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు..

ప్రజాశక్తి – గజపతినగరంరూరల్, వేపాడ

గజపతినగరం మండలం పాతబగ్గాం గ్రామంలో ఎరుకులపేట ప్రాథమిక పాఠశాల దుర్భర స్థితిలో ఉంది. ఎరుకులపేట వాసులకు దాదాపు పాతికేళ్ల క్రితం అక్షరాస్యత పెరగాలని ఉద్దేశంతో, పేటలో బడి బయట పిల్లలను బడిలో చేర్చాలనే నినాదంతో జిల్లా ప్రాథమిక విద్యా పథకం ద్వారా మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను నిర్మించారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తరగతి గదులు శిథిలావస్థకు చేరి పైకప్పులు పెచ్చులూడి పడుతున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు పిల్లలను పంపేందుకు వెనుకడుగు వేస్తున్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలతో పాటు కొత్త భవనం ఏర్పాటు చేయాలని గ్రామ పెద్దలతోపాటు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా పాఠశాల

వేపాడ మండలం కొండగంగుపూడి పంచాయతీ పరిధిలో గిరిజన గ్రామమైన బంగారయ్యపేటలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలకు పిల్లలను పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడం, గోడలు బీటలు వారిపోయి, కిటికీలు రెక్కలు ఊడిపోయి, పాఠశాలకు తలుపులు లేకుండా దర్శనమిస్తోంది. రికార్డులు దాచుకొనేందుకు అవకాశం లేకుండా పోయింది. నిత్యం పాఠశాల ఆవరణలో విషసర్పాలు సంచరిస్తుంటాయి. తాగునీరు, మధ్యాహ్న భోజనం వంటకు వసతి సౌకర్యమూ లేదు. పాఠశాలకు వెళ్లేందుకు సరైన మార్గం లేదు. పొలాల గట్ల మీదుగా రాకపోకలు సాగించారు. ఏమాత్రం వర్షం పడినా పొలాల గట్లపై వెళ్లలేని పరిస్థితి.



బంగారయ్యపేట పాఠశాలకు పొలాల గట్ల మీదుగా వెళ్తున్న విద్యార్థులు

గతంలో ఈ పాఠశాల దుస్థితి గురించి 'ప్రజాశక్తి'లో కథనం రావడంతో అధికారులు స్పందించి, నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదన పంపించారు. దీనికి ఇంచుమించు ఏడాది కావస్తున్నా అతీ గతీ లేదు.

గిరిజన విద్యపై నిర్లక్ష్యం వద్దు



ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు అన్ని విధాలా సహకరిస్తామని చెప్పడమే మిగుల్తోంది. అంతే తప్ప గిరిజన గ్రామాల్లో పాఠశాలలను పట్టించుకోవడం లేదు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి భయంకరంగా తయారైందని గిరిజనులు వాపోతున్నా కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. గిరిజన విద్యపై నిర్లక్ష్యం చేయొద్దు. వెంటనే జిల్లాలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలను తొలగించి, నూతన భవన నిర్మాణాలు చేపట్టాలి.

– తమ్మినేని సూర్యనారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి

భయంతోనే చదువులు



విద్యార్థులు పాఠశాలలో చదవాలంటే ఎప్పుడు స్లాబ్ పడిపోతుందో అనే భయంతో ఉంటున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో ప్రశాంతంగా తినలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో పిల్లలను పాఠశాలకు పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు.

– రాము, ఎస్ఎంసి చైర్మన్, ఎరుకులపేట, గజపతినగరం మండలం


ప్రతిపాదన పంపించాం



ఎరుకులపేట పాఠశాల సమస్య గతంలో మా దృష్టికి వచ్చింది. పాత భవనం తొలగించి, కొత్త భవన నిర్మాణానికి డిఇఒ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలో అనుమతులు వస్తే పనులు చేపడతాం. మౌలిక సదుపాయాలకు కృషి చేస్తాను.

– విమలమ్మ, ఎంఇఒ, గజపతినగరం

నిధులు మంజూరైన వెంటనే..



పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడం వాస్తవమే. అధికారుల ఆదేశాల మేరకు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు కోసం ప్రతిపాదనలు తయారు చేసి పంపించాం. నిధులు మంజూరైన వెంటనే భవన నిర్మాణం చేపడుతాం.

– పి.బాల భాస్కరరావు, ఎంఇఒ, వేపాడ

నీట్ ఫలితాల్లో
మెరిసిన విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, బొబ్బిలి, చీపురుపల్లి



ఎం.తులసి భార్గవ్‌రామ్ 211వ ర్యాంకు



డి.జాహ్నవి 358వ ర్యాంకు



పి.వింధ్యహాసిని 404వ ర్యాంకు



యు.సాయిశిరీష 440వ ర్యాంకు



ఎం.ఈశ్వర్‌తేజ 463వ ర్యాంకు



ఎం.సంజన 503వ ర్యాంకు



పి.లావణ్యశ్రీ 507వ ర్యాంకు



ఎన్.అక్షయ 528వ ర్యాంకు



కె.నిధి 642వ ర్యాంకు



యశస్విని 646వ ర్యాంకు



ఎం.జయదీప్ 672వ ర్యాంకు



అభిరాం 2787వ ర్యాంకు

శనివారం విడుదలైన నీట్ పరీక్ష ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించారు. జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు శ్రీచైతన్య కళాశాలలో చదువుకొని ఆలిండియాలో ర్యాంకులు సాధించారు. పిన్నింటి వింధ్యహాసిని 404 ర్యాంక్, యు.సాయి శిరీష 440, ఎం.ఈశ్వర్ తేజ 463, ఎం.సంజన 503, పి.లావణ్య శ్రీ 507, ఎన్.అక్షయ 528, కె.నిధి 642 ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను చైతన్య విద్యాసంస్థల ఎజిఎం నర్సునాయుడు, జోనల్ ప్రిన్సిపాల్ కె.శ్రీధర్, ఎఒ మధుసూదనరావు, ప్రిన్సిపాల్ రాంబాబు, రామచంద్రరావు, జోగినాయుడు అభినందించారు.

తెర్లాం మండలం లోచర్ల గ్రామానికి చెందిన మర్రాపు తులసి భార్గవ్ రామ్ ఆలిండియా ర్యాంక్ 211, ఒబిసి విభాగంలో 55 వ ర్యాంక్ సాధించాడు. ఇంటర్ విశాఖలోని ఎసెంట్ కాలేజీలో చదువుకున్నాడు. తండ్రి మర్రాపు త్రినాధ్ నాయుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా, తల్లి గంగభవాని గృహిణి. భవిష్యత్ లో న్యూరాలజిస్ట్ విభాగంలో సేవలందిస్తానని భార్గవ్‌రామ్ తెలిపాడు.

చీపురుపల్లికి చెందిన రోహిత్ ధనుక ఆలిండియా 6,918వ ర్యాంకు సాధించాడు. రోహిత్ విజయవాడలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకున్నాడు. ఈయన తండ్రి దిలీప్ ధనుక చీపురుపల్లిలో ట్రేడర్స్ బిజినెస్ చేస్తుంటారు. చీపురుపల్లికి చెందిన గవిడి లిఖిత 13,997వ ర్యాంకు సాధించింది. లిఖిత విశాఖపట్నంలోని శ్రీ విశ్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువు కుంది. లిఖిత తండ్రి గవిడి నాగరాజు చీపురుపల్లి కనకమహలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఉన్నారు. తల్లి భారతి చీపురుపల్లిలో ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుంది.

బొబ్బిలి పట్టణంలోని మెహర్ కాలనీకి చెందిన మర్రాపు జయదీప్ నీట్‌లో 672వ ర్యాంకు సాధించాడు. విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో చదువుతున్నాడు. ఒబిసి కేటగిరీలో 183వ ర్యాంకు పొందాడు. జయదీప్ తండ్రి రామకృష్ణ హెచ్‌ఎం కాగా, తల్లి శోభారాణి తామరఖండి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు. ఎంబిబిఎస్ పూర్తి చేసి పిజిలో స్పెషలైజేషన్ చేస్తానని జయదీప్ చెప్పాడు.

పార్వతీపురం మండలంలోని తాళ్లబురిడి గ్రామానికి గ్రామానికి చెందిన దాసరి వెంకటరమణ, రామలక్ష్మిల కుమార్తె దాసరి జాహ్నవి ఆలిండియా 358 ఒబిసి 90 ర్యాంకు సాధించింది. ఇదే గ్రామానికి చెందిన రామకృష్ణ, జానకి కుమారుడు అభిరామ్ 2787, ఒబిసి 996 ర్యాంకు సాధించారు. జాహ్నవి తండ్రి ఉద్యోగరీత్యా ఒడిశాలో పనిచేస్తుండగా ఆమె విశాఖపట్నంలో చదువుకుంది. అభిరామ్ తల్లిదండ్రులు పార్వతీపురం పట్టణంలో కార్పెంటరీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు.

యశస్వినికి 646వ ర్యాంకు

కొమరాడ : నేటి పరీక్ష ఫలితాల్లో కొమరాడ విద్యార్థిని నీరస యశస్విని మంచి ర్యాంకుతో సత్తా చాటారు. యశస్విని నీట్‌లో ఆలిండియా 646 ర్యాంకు, ఒబిసి కోటాలో 176 ర్యాంక్ సాధించింది.కొమరాడకు చెందిన యశస్విని తండ్రి నీరస శ్రీనివాసరావు పార్వతీపురం మండలం ఎంఆర్‌నగరం హై స్కూల్లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. యశస్విని మంచి ర్యాంకు సాధించడం పట్ల విద్యార్థిని కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

ప్రోత్సాహకాలు సరే... పాఠశాలల ఎత్తివేత ఎందుకు?

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

ఇంటర్, పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఇటీవల ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు అందజేసింది. షైనింగ్ స్టార్స్ అంటూ వెన్నుతట్టింది. అంత వరకు అభినందనీయం. బాగా చదవిన వారిని ప్రోత్సహించడం ద్వారా వారిలో మరింత పట్టుదల పెరిగేందుకు అవకాశం ఉంటుంది. వెనుకబడిన వారిలో పోటీతత్వం మొదలవుతుంది. కానీ, విద్యార్థులను ఇంతలా ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం బడులు నడిపే విషయంలో ఎందుకు అంత శ్రద్ధ చూపడం లేదనేదే సగటు తల్లిదండ్రులను వేధిస్తున్న ప్రశ్న. ఉపాధ్యాయ పోస్టులకు ఎసరు మొదలుకుని, స్కూళ్ల మూతకు దారితీసే జిఒ నెంబర్ 117 రద్దుచేయాలని గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా పోరాడారు. ఈనేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే ఆ జిఒను రద్దుచేస్తామని టిడిపి నాయకులు చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం రద్దు చేసినా అవే విధానాలను కొనసాగించారు. ఆ వెంటనే జారీచేసిన జిఒ నెంబర్ 19, 20, 21 ద్వారా పాఠశాలల రద్దు, ఉపాధ్యాయ పోస్టులకు కుదింపునకు కారణమైంది. ప్రస్తుతం ఉన్న మండల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల స్థానంలో 9 రకాల పాఠశాలలను ఏర్పాటు చేసింది. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులను సైతం సర్దుబాటు చేయడమే జీవో 19,20,21 లక్ష్యమని ఉపాధ్యాయ సంఘాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ జీవోల ప్రకారం ఫౌండేషన్ స్కూళ్లు, బేసిక్ ప్రైమరీ స్కూళ్లు, మోడల్ ప్రైమరీ స్కూళ్లు, పిపి -1, పిపి-2 స్కూళ్లు, యుపి స్కూళ్లు, హైస్కూళ్లు, ఏకోపాధ్యాయ స్కూళ్లు తదితర తొమ్మిది రకాల పాఠశాలలుగా మార్చనున్నారు. ఈ విధానం వల్ల పాఠశాలల సంఖ్య, ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య తగ్గిపోవడం మినహా విద్యార్థులకు అదనంగా సమకూరే ప్రయోజనాలంటూ ఏమీ లేవన్నది ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాల వాదన. పరిస్థితులు కూడా ఇందుకు తగ్గట్టే కనిపిస్తున్నాయి. దాదాపు అన్ని గ్రామాల్లోనూ 1,2వ తరగతులతో నడిచే బేసిక్ ప్రైమరీ స్కూళ్లు ఉంటాయి. కొన్ని గ్రామాల్లో 1 నుంచి 10వ తరగతి వరకు నడిచే ఉన్నత పాఠశాలలు ఉంటాయి. ఇలాంటిచోట ప్రైమరీ, లేదా ఉన్నత పాఠశాలల్లో తమకు నచ్చిన పాఠశాలలకు పిల్లలను తల్లిదండ్రులు పంపుతారు. ఇటువంటి చోట పిల్లలు తక్కువగా ఉన్నారన్న నెపంతో ఆ గ్రామంలోని బేసిక్ ప్రైమరీ స్కూళ్లను తాజా విధానంగా ప్రభుత్వం ఎత్తివేస్తుంది. దీంతో కొన్నాళ్లకు బేసిక్ ప్రైమరీ స్కూళ్ల కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. ప్రస్తుతం జిల్లాలో 1 నుంచి 5 వరకు నడిచే ప్రాథమిక పాఠశాలలు 1718 ఉన్నాయి. వీటిని విచ్ఛిన్నం చేయడం ద్వారా సుమారు 1482 మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో సుమారు 235కు పైగా యుపి పాఠశాలలను ఎత్తివేసేందుకు అవకాశం ఉన్నట్టుగా ఉపాధ్యాయ సంఘాలు విశ్లేషిస్తున్నాయి. పంచాయతీ కొక మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసి అక్కడ తరగతికొక ఉపాధ్యాయుడ్ని నియమిస్తామని ప్రభుత్వం చెబుతోంది. దీనివల్ల ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య గణనీయంగా తగ్గిపోనుంది. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలకు, మోడల్ ప్రాథమిక పాఠశాలలకు సర్దుబాటు చేస్తామని చెబుతోంది. మోడల్ ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే 3,4,5 తరగతుల విద్యార్థులు కనీసం 3 నుంచి 5 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి ఉంటుంది. ఈ కారణాల రీత్యా పిల్లలను తల్లిదండ్రులు మోడల్ ప్రాథమిక పాఠశాలకు పంపించే అవకాశంలేదు. ప్రయాణ భత్యం ఇస్తామని చెపుతున్నా అది ఆచరణలో ఎంతవరకు అమలవుతుందనేది ప్రశ్నార్థకంగా వుంది. ఉన్నత పాఠశాలల్లో కేవలం ఇంగ్లీష్ మీడియం ఒక్కటే అమలు చేయడం వల్ల మిగిలిన భాషా పండిత పోస్టులను ప్రభుత్వం ఇప్పటికే మిగులు పోస్టులుగా చూపుతోంది. మరోవైపు డిఎస్‌సిలోనూ 3వేల పోస్టులకు కోతపెట్టారు. ఆ మేరకు మన జిల్లాలోనూ పోస్టులు తగ్గాయి. విద్యారంగ అభివృద్ధికి అవసరమైన మౌలిక సూత్రాలను పక్కనబెట్టి కేవలం షైనింగ్ స్టార్స్ పేరిట నగదు, జ్ఞాపికలతో సరిపెట్టడం ప్రభుత్వం చేస్తున్న మోసపూరిత విధానాలను మరిపించడమేనన్నది పబ్లిక్ టాక్.



జిల్లా వ్యాప్తంగా యోగాభ్యాసన

కంటోన్మెంట్ : జిల్లా వ్యాప్తంగా శనివారం యోగా మాక్‌డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21 తేదీన ప్రధాని మోడీ విశాఖలో పాల్గొంటున్న యోగా కార్యక్రమాన్ని రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీనిలో భాగంగా గతనెల 21 నుంచి యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనెల 21న రికార్డు స్థాయిలో జరిగే ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమానికి సన్నద్ధంలో భాగంగా, జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తం గా సచివాలయాల పరిధిలో సన్నాహక యోగా అభ్యాసాలు నిర్వహించారు. ప్రధాన మంత్రి విశాఖలో హాజరయ్యే యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా నుంచి సుమారు 30 వేలమంది యోగ సాధకులను తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు జెసి ఈ సందర్భంగా తెలిపారు. జిల్లాలో నమోదు అయిన 5652 కేంద్రాల్లో సుమారు 3 లక్షల మంది యోగ డెమోలో పాల్గొన్నట్లు చెప్పారు. 21న జరిగే మెగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెసి కోరారు.



ప్రచారం ఘనం..
అభివృద్ధి శూన్యం

ఏడాదిలో నగర పాలక సంస్థ పరిపాలన తీరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్


నగర పాలక సంస్థలో పాలన ప్రచారం ఘనం..అభివృద్ధి శూన్యంలా ఉంది. ఏడాది కాలంగా అభివృద్ధి పనులు పడకేశాయి. అపారిశుధ్యం తాండవిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, అటు కూటమి పాలకులు, ఇటు పాలకవర్గంలో ఉన్న వైసిపి ప్రజాప్రతినిధులు, కొత్తగా నగర పాలక సంస్థకు వచ్చిన అధికారులు గాని పరిపాలనలో కొత్తదనం చూపలేదు. గత వైసిపి పాలనలో అప్పటి ఎమ్మెల్యే, నగర పాలక సంస్థ పాలకవర్గం ఒకే పార్టీకి చెందిన వారు ఉండటంతోకొన్ని అభివృద్ధి పనుల్లో తమ మార్కు చూపించే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడం, విజయనగరం ఎమ్మెల్యేగా టిడిపి గెలవడం, నగర పాలకసంస్థలో పాలకవర్గం వైసిపిది కావడంతో ప్రజాసమస్యలు పరిష్కారంలోను, అభివృద్ధి పనుల్లోనూ విఫలమయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో పాలకవర్గం కూడా నైరాశ్యంలోకి వెళ్లిపోయింది. దీంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగాడుంది.

ఏడాదిలో ఒక్క రోడ్డు, కాలువ లేదు

ఏడాది కాలంలో నగరంలో ఒక్క కాలువ గాని, రోడ్డు గాని కొత్తగా నిర్మించిన దాఖలాలు లేవు. గత ప్రభుత్వంలో ప్రతిపాదించిన సుమారుగా 150 పనులు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చేయకుండా వాటిని రద్దు చేశారు. ఇప్పుడు పాత వాటితో కలుపుకొని 275 రకాలు పనులకు, కాలువలు, కల్వర్టుల నిర్మాణం, రోడ్లు, పైప్ లైన్ వంటి పనులు ఏడాది కాలంలో పెండింగ్‌లో ఉండిపోయాయి. మరో వైపు వాటిని చేసేందుకు ఇటీవల టెండర్లు పిలిచి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైన సందర్భంగా కొన్ని పనులకు శంకుస్థాపనలు చేశారు.

కొనసాగుతున్న తాగునీటి కష్టాలు

25 ఏళ్ల క్రితం నిర్మించిన తాడిపూడి, నెల్లిమర్ల నీటి పథకాలు నుంచి వచ్చే నీరు తప్ప కొత్త నీటి పథకం ఆ నాటి నుంచి నేటి వరకు ఏర్పాటు చెయ్యలేదు. వేసవి వస్తే ఆంధ్ర ప్రాజెక్ట్ నీటి కోసం గజపతినగరం ఎమ్మెల్యే చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంది. కోట్లాది రూపాయిల రకరకాలు పేర్లతో ఖర్చు చేస్తున్నారు తప్ప నేటి వనరులు పెంచే ప్రయత్నం చేయడం లేదు. మరో వైపు 20 కోట్లతో పెద్ద చెరువు వద్ద మురికి నీటి శుద్ధి పరిశ్రమకు శంకుస్థాపన చేసినా నిర్లక్ష్యం కొనసాగుతోంది. మరోవైపు రామతీర్థసాగర్ ప్రాజెక్టు పూర్తయితే 2 0 ఎంఎల్‌డి తాగునీరు విజయ నగరానికి రానుంది. కానీ ఆ ప్రాజెక్టు పూర్తికి ప్రయత్నం లేదు.





కెఎల్‌పురంలో కాలువల్లేక రోడ్డుపైకి చేరిన మురుగునీరు

మూలనపడ్డ తాగునీటి కుళాయిలు

పేదలకు ఇచ్చే రూ.200కే కుళాయి కనెక్షన్లు పథకం అమలుకు నోచుకోలేదు. నగరంలో 17 వేలు వరకు కొత్త నీటి కుళాయిలు అమృత పథకం ద్వారా ఇస్తామని ప్రకటించారు. ఏడాది కాలంలో కుళాయి కనెక్షన్లు కోసం పెట్టుకున్న దరఖాస్తులు ఈ డివిజన్ సచివాలయాల్లో ఉన్నాయి తప్ప ఒకటి కూడా మంజూరు చెయ్యలేదు. కేవలం రూ.10వేలు, 6వేల రూపాయిలు కుళాయి కనెక్షన్లు పాలకులు సిఫార్సుల మేరకు కొన్ని ఇచ్చారు తప్ప పేదలకు ఇచ్చే కుళాయి కనెక్షన్లు ఏడాది కాలంలో పూర్తిగా విస్మరించారు.

ఉపాధి అవకాశాలు కరువు

నగరంలో కొన్ని వేల మందికి ఉపాధి కల్పించే జ్యూట్ మిల్లులు మూతపడటంతో సుమారుగా పది వేలకు పైగా కార్మికులు రోడ్డున పడ్డారు. వారంతా షాపుల్లో, చిన్న చిన్న దుకాణాల్లో,బట్టలు షాపుల్లో చేరారు. మరో వైపు నిరుద్యోగ అభ్యర్థులు సంఖ్య ఏడాదికి ఏడాది పెరుగుతున్నారు. వారికి ఉపాధి అవకాశాలు లేక వక్రమార్గాలు పడుతున్నారు. దీంతో నగరంలో యువత అధికంగా మత్తు మందులకు బానిస అవుతున్నారు. గత పాలకులు, ఏడాదిలో కూటమి పాలకులు ఉపాధి కల్పించేందుకు చేపట్టిన చర్యలులేవు.

తగ్గుతున్న ప్రభుత్వ విద్యాలయాలు

నగరంలో సుమారుగా మూడున్నర లక్షల జనాభా ఉన్నారు. జనాభా ఆధారంగా కనీసం ప్రతి డివిజన్‌కు ఒక హై స్కూల్ ఉండాల్సి ఉంది. 50 డివిజన్లలోనూ జనాభా ప్రాతిపదికన హైస్కూళ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ పాలకులు వాటి గురించి ఆలోచించి పెంచే ప్రయత్నం చేయడం లేదు. ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల సంఖ్య ఏటా పెరుగుతోంది. ప్రభుత్వ స్కూళ్లు,జూనియర్ ,డిగ్రీ కాలేజీలు సంఖ్య మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. నగరంలో ఉన్న మూడు మున్సిపల్ హైస్కూళ్ళు, ఒక జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఎంత మాత్రం సరిపోవడం లేదు. దీంతో వారంతా ప్రైవేటు విద్యాసంస్థలను ఆశ్రయించాల్సి వస్తోంది.

వంగరలో కుండపోత వర్షం

ప్రజాశక్తి - వంగర

మండలంలోని శివ్వాం, ఎం.సీతారాంపురం, తలగాం, మద్దివలస, కొత్తవలస, రుషింగి తదితర గ్రామాలలో శనివారం సాయంత్రం గంటన్నర కాలం పాటు కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. సాయంత్రం ఉరుములు మెరుపుతో వర్షం కురవడంతో ప్రజలు భీతిల్లిపోయారు. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. మురుగునీరు ఇళ్లల్లో చేరడంతో పాటు వర్షం వల్ల విద్యుత్తుకు అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విజయనగరంలో కూడా భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

నేడు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఆంధ్రప్రదేశ్ శిష్టకరణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కెఎల్‌పురంలోగల కమ్యూనిటీ హాలులో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం ఆదివారం ఉదయం జరుగుతుందని ఆ సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమలు, సెర్ప్ ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి విజయలక్ష్మి గజపతిరాజు హాజరవుతారని పేర్కొన్నారు. ముగ్గురు అతిథులు చేతుల మీదుగా విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు

ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు తొలగింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రహదారులు, ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలను చేపట్టరాదని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ప్రధాన రహదారులు, జన సమ్మర్థం ఉన్న ప్రాంతాలలో చిరు వ్యాపారాలు చేపట్టడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతుందని అన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు ప్రణాళిక సిబ్బంది గంటస్తంభం, కోడి రామ్మూర్తి వ్యాయామశాల, న్యూపూర్ణ జంక్షన్ వంటి ప్రాంతాలలో రహదారులను ఆక్రమించి చిరు వ్యాపారాలు చేపడుతున్న వారిని అక్కడ నుండి తరలించి వేశారు. ప్రతిరోజు ఉదయం ఇందుకోసం ప్రత్యేక సిబ్బందితో క్రమబద్ధీకరణ చర్యలు చేపడుతున్నామన్నారు.

విక్టరీ పాఠశాలలో యోగాసనాలు

ప్రజాశక్తి-వేపాడ

వేపాడలో విక్టరీ హైస్కూల్ ఆవరణలో శనివారం విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. విక్టరీ హై స్కూల్ డైరెక్టర్ రాఘవ్ మాట్లాడుతూ యోగా జీవితంలో ఒక భాగం కావాలన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు వర్మ, మండల అధ్యక్షులు పవన్, శ్రీవిక్టరీ స్కూల్ కరస్పాండెంట్ దాలినాయుడు పాల్గొన్నారు.



టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లాను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన, తెంటు రాజా

పల్లాకు బేబినాయన పరామర్శ

ప్రజాశక్తి-బొబ్బిలి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును ఎమ్మెల్యే బేబినాయన, మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు పరామర్శించారు. ఇటీవల పల్లా శ్రీనివాసరావు తండ్రి పల్లా సింహాచలం అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం శ్రీనివాసరావును ఆయన నివాసంలో పరామర్శించి, సానుభూతి తెలియజేశారు. సింహాచలం చిత్రపటానికి నివాళులర్పించారు.

విమలరాణికి పరామర్శ

ఐటిడిపి జిల్లా అధ్యక్షులు విమలరాణిని ఎమ్మెల్యే బేబినాయన, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పరామర్శించారు. విమలరాణి తండ్రి కె.వి.సాంబశివరాజు మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతి తెలియజేశారు.

బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్

ప్రజాశక్తి- భోగాపురం

భోగాపురం తాహశీల్దార్‌గా మొండి రమణమ్మ శుక్రవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తాహశీల్దార్ ఎం.సురేష్‌కు మన్యం జిల్లా పార్వతీపురం బదిలీ జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన తాహశీల్దార్‌ను డిప్యూటీ తహశీల్దార్ హరి, ఆర్ఐ, కార్యాలయ సిబ్బంది తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



క్రీడాకారులను అభినందిస్తున్న తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు అయ్యలు

తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 9,10,11 తేదీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో విజయనగరం క్రీడాకారులు సత్తా చాటారు. ఓవరాల్ ఛాంపియన్ షిప్ లో మూడో స్థానం కైవసం చేసుకున్నారు. 19గోల్డ్ మెడల్స్, 6సిల్వర్ మెడల్స్, 8బ్రాంజ్‌మెడల్స్ సాధించారు. క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు గురానఅయ్యలు, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్. వేణుగోపాలరావు, కోచ్ యశస్విని అభినందించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విజయనగరం టౌన్ డిఇఇ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్ల సబ్ స్టేషన్ 33/11కెవి పరిధి గుర్ల 11కెవి రూరల్ ఫీడర్ మీద వ్యవసాయం కనెక్షన్ పనులు కొనసాగింపు, చెట్టు కొమ్మలు తొలగింపు, సాంకేతిక సమస్యలు పరిష్కారం కోసం గరికిపేట, కొండగుంపాం, పూతిక పేట గ్రామాలకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియో గదారులు సహకరించాలని కోరారు.

స్కూటీలో తరలిస్తున్న గంజాయి పట్టివేత

నిందితులు పరారీ

ప్రజాశక్తి-రామభద్రపురం

స్థానిక పోలీసు స్టేషన్ వద్ద శనివారం రాత్రి ఎస్ఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేస్తుండగా గంజాయితోస్కూటీపై వస్తున్న ఇద్దరు యువకులు పోలీసులను చూసి వాహనం విడిచిపెట్టి వెళ్లిపోయారు. ఈ వాహనాన్ని తనిఖీ చేయగా డిక్కీలో 20 కేజీల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. అయితే పారిపోతున్న యువకులను వెంటాడినప్పటికీ వారు తప్పించుకు పోయారు. దీంతో పోలీసులు గంజాయితో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ అప్పారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అయితే ఈ వాహనం ఎక్కడి నుంచి వస్తున్నది అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ముందస్తు సమాచారం మేరకే ఈ వాహనాల తనిఖీ చేపట్టినట్టు తెలుస్తోంది.


ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

రక్తానికి ప్రత్యామ్నాయం లేదని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సామాజిక వేత్త ఎస్ఎస్ఎస్ఎస్ రాజు అన్నారు. శనివారం ఆశయ బ్లడ్ డోనర్స్ క్లబ్,సెట్విజ్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ రక్త దాతల దినోత్సవం పురస్కరించుకొని స్వచ్ఛంద రక్తం దాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది నాలుగెస్సల రాజు మాట్లాడుతూ రక్తానికి ప్రత్యామ్నాయం లేదు కనుక ఆరోగ్య వంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి తోటివారిని కాపాడాలని పిలుపునిచ్చారు. భారత మాజీ వాయు సైనికులు, నిరంతర రక్త దాత, ఉపాధ్యాయులు బొడ్డేపల్లి రామకృష్ణారావు 191వ సారి, చైతన్య వర్మ 146వ సారి, బాలరాజురావు 59వ సారి, సురేష్ 38వ సారి, విజయకుమార్ తొలిసారి రక్తదానం చేసారు. అతిధులు సెట్విజ్ సూపరెంటెండెంట్ అక్కారావు, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సరోజ్, డాక్టర్ చంద్రశేఖర్, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రోగ్రాం ఆఫీసర్ సాక్షి గోపాలరావు సిబ్బంది, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌విఎన్ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యాన


ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో తాడేపల్లి నాగేశ్వరరావు అధ్యక్షత రక్త దాతల సత్కారసభ జరిగింది. ఈ సందర్భంగా లోక్‌సత్తా అధ్యక్షులు భీశెట్టి మాట్లాడుతూ బతికి ఉండేటప్పుడు రక్తదానం, చనిపోయిన తర్వాత అవయవ దానం చేసే అదృష్టం ఒక్క మానవుడికి మాత్రమే ఉందని అటువంటి గొప్ప అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. విజయనగరం జిల్లాలో రక్తదాన చైతన్య కార్యక్రమాలు పెరగటం వెనుక తాడేపల్లి నాగేశ్వరరావు, ఇప్పలవలస గోపాలరావు కృషి ఉందని, ప్రజలు మరింత చైతన్య వంతం కావడానికి జిల్లాలోని స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని కోరారు, డాక్టర్ అయ్యగారి కామేశ్వరరావు మాట్లాడారు. జిల్లాలో రక్తదాన శిబిరాలు నిరంతరం నిర్వహించిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సత్కరించారు.



సాధన యువజన సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న భీశెట్టిబాబ్జీ

సమాజానికి స్ఫూర్తి ...రక్త దాతలే

సమాజానికి స్ఫూర్తి ప్రదాతలు రక్త దాతలేనని రోటరీ జిల్లా చైర్మన్ జెసి రాజు అన్నారు. రక్త దాతల దినోత్సవ సందర్భంగా బొబ్బిలి రోటరీ క్లబ్ సభ్యులుగా రోటరీ, వివిధ రక్తదాన శిబిరాల్లో అత్యధిక సార్లు రక్తదానం చేసిన రొటేరియన్స్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా సింద్రీ శ్రీనివాసన్ (43 సార్లు), శ్రీ హరి (38 సార్లు) శంకర రావు (42సార్లు) లను శనివారం రోటరీ కార్యాలయంలో చైర్మన్ జె సి రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి కె రామ కృష్ణ, సెక్రటరీ ఎలెక్ట్ శివకాంత్ సర్వీస్ చైర్ కష్ణ మోహన్ వారిని ఘనంగా సత్కరించారు.



బొబ్బిలి : రక్తదానం చేసిన ప్రజాశక్తి విలేకరి జగన్మోహన్‌ను అభినందిస్తున్న అవేర్ సభ్యులు

72 మంది రక్తదానం

అవేర్ ఫౌండేషన్ అధినేత పెద్దింటి మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆ ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో 72 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, ఎఎంసి మాజీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు, బొబ్బిలి బ్లడ్‌బ్యాంకు మేనేజర్ పి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

'సాధన' రక్త దాతకు సత్కారం

నెల్లిమర్ల : జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘం అధ్యక్షుడు, రక్తదాత పి.దుర్గాప్రసాద్‌కు సత్కారం జరిగింది. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా విజయనగరం యన్‌వియన్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అత్యధికంగా 66 సార్లు రక్తదానం చేసి, యువకులను రక్తదాతలుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్న దుర్గాప్రసాద్‌కు లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీసెట్టి బాబ్జీ చేతులమీదుగా సత్కారం చేశారు. ఈ సందర్భంగా దుర్గ ప్రసాద్‌కు పలువురు అభినందనలు తెలిపారు.



ఆశయ బ్లడ్ డోనర్స్ క్లబ్, సెట్విజ్ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న యువకులు

శృంగవరపుకోట: మండలంలోని శివరామరాజిపేట గ్రామంలో సర్పంచ్ జగదీష్, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, సీనియర్ నాయకులు అంజి, రిటైర్డ్ ఆర్మీ, వారాహి రెస్టారెంట్ మేనేజింగ్ డైరెక్టర్ సుధాకర్ ఆధర్యంలో ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా ఉచిత రక్తదాన శిబిరం శనివారం నిర్వహించారు. యూత్ కమిటీ సభ్యులు, ఆ పరిసర ప్రాంత యువకులు పెద్ద సంఖ్యలో హాజరై స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాన శిబిరంలో మొత్తం 40 మంది పాల్గొనగా 33 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ బ్లడ్‌బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీత, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట : రక్తదానం చేస్తున్న యువత

15 నుంచి పథకాలపై గిరిజనులకు అవగాహన

కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి- కంటోన్మెంట్



జూన్ 15 నుండి 30 వరకు ధర్తీ అబా అభియాన్ పేరుతో గిరిజన లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగించడం, లబ్ధిచేకూర్చడానికి సంపూర్ణ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ తెలిపారు. ప్రధాన మంత్రి జనజాతీయ ఆదివాసి న్యాయ మహా అభియాన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాలలో లక్షిత జోక్యాల ద్వారా సేవలు మౌలిక సదుపాయాలను సంపూర్ణంగా అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. ఈ ప్రచారం గ్రామం/క్లస్టర్ స్థాయి శిబిరాల ద్వారా లబ్ధిదారులకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, నివాస ధ్రువీకరణ పత్రాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, పిఎం కిసాన్, జన్ ధన్‌ఖాతా, గ్యాస్ కనెక్షన్లు, బీమా కవరేజ్ , సామాజిక భద్రతా పెన్షన్లు, జీవనోపాధి పథకాలు, పిఎం విశ్వకర్మ, ముద్ర రుణాలు, మహిళా శిశు సంక్షేమ/ఆరోగ్యం ప్రయోజనాలు, టీకాలు తదితర హక్కులను, సేవలను అందించడం జరుగుతుందన్నారు. అన్ని కార్యకర్తల చురుకైన భాగస్వామ్యంతో ఈ శిబిరాలను నిర్వహించడానికి, క్షేత్ర స్థాయిలో విజయం సాధించడానికి అన్ని లైన్ డిపార్ట్‌మెంట్ల ఏకీకరణ భాగస్వామ్యం అవసరమని తెలిపారు. వ్యక్తిగత అర్హతల పంపిణీలో లోపాలున్న పివిటిజి ఆవాసాలు, ఎంపిక చేసిన గిరిజన గ్రామాలను గుర్తిస్తారని తెలిపారు. ఈ అవకాశాలను గిరిజనులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళలకు ప్రభుత్వ ఆసరా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వేపాడ

మహిళలకు ఆసరాగా ఉండేందుకు ప్రభుత్వం వినూత్న పథకాలను ప్రవేశ పెడుతోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. శనివారం వేపాడ మండల కేంద్రంలో రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని తెలిపారు. ఎన్నికల్లో చెప్పిన విధంగా ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం అమలు చేశామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి లక్ష్మి, ఉపాధ్యక్షులు పోతల వెంకటరమణ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గుమ్మడి భారతి, నాయకులు గంటుపల్లి దేముడునాయుడు, డెక్క దేముడునాయుడు, జగన్నాథం నాయుడు, నిరుజోగి అమ్మతల్లి నాయుడు, దుల్ల వెంకటరావు, కోన సత్యం, చల్ల వెంకటరావు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

మండల సమాఖ్యల ఆడిట్

ప్రజాశక్తి-రాజాం

డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణ్‌చక్రవర్తి ఆదేశాల మేరకు రాజాం ఎసి క్లస్టర పరిధిలోని నాలుగు మండలాల మడల సమాఖ్యల అంతర్గత ఆడిట్ శనివారం మార్కెట్ యార్డులో జరిగింది. ఏరియా కో ఆర్డినేటర్ ఎ.చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆడిట్‌లో ఆయన మాట్లాడుతూ సీనియర్ ఫైనాన్స్ సిసిలతో టీమ్‌లు ఏర్పాటు చేసి మండలానికి ఒకటి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆడిట్ ను సెర్ప్-డిఆర్‌డిఎ ఎపిడి కె.సావిత్రి ఆధ్వర్యాన పరిశీలించిన టీములు మండల సమాఖ్యలకు లోపాలపై పలు సూచనలు చేశాయి. మినిట్ బుక్, నగదు పుస్తకం, లోన్ లెడ్జెర్, సాధారణ ఆవర్జా, డిసిబి రిజిస్టర్ పక్కాగా నిర్వహిస్తూ ఆర్థిక లావాదేవీలన్నీ సిబిఒ అకౌంటింగ్ లో నమోదు చేయాలని ఎపిడి తెలిపారు. ఆర్థిక మోసాలు, పొరపాట్లు జరిగే అవకాశాలను తగ్గించవచ్చునని, ఆర్థిక లావాదేవీలన్నీ సక్రమంగా జరుగుతున్నవి, లేనివి పరిశీలించి చట్టపరమైన సమస్యలను నివారించివచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఫైనాన్స్ డిపిఎం లక్ష్మునాయుడు, ఫైనాన్స్ ఎపిఎం విశ్వేశ్వరరావు, నాలుగు మండలాల సిసిలు, వెలుగు సిబ్బంది, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలి

జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయులు విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచి చీకట్లో వెలుగు నిచ్చే టార్చ్ లైట్‌లా వారి జీవితాల్లో వెలుగులు నింపాలని జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు అన్నారు. జనవిజ్ఞాన వేదిక విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం గురజాడ పాఠశాలలో ఉత్తరాంధ్ర జిల్లాల జెవివి సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిఇఒ మాట్లాడుతూ ఉత్తమ సమాజాన్ని తీర్చిదిద్ద గలిగే శక్తి ఉపాధ్యాయులకే ఉందని, ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు తమ పిల్లల పట్ల ఎంత శ్రద్ధ తీసుకుంటారో,అదే శ్రద్ధ విద్యార్థుల పట్ల చూపించాలని సూచించారు. సొంత పిల్లలుగా భావించి వారికి విద్యాబుద్ధులు నేర్పించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ మూలాలను మర్చిపోకూడదని, గతంలో ఎలా బతికామ గుర్తుపెట్టుకుని నడుచుకుంటే ఉత్తమ విద్యార్థులను తయారు చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జెవివి వ్యవస్థాపకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మంచి సమాజాన్ని తయారు చేసే శక్తి ఉపాధ్యాయులకే ఉంటుందని, ఉపాధ్యాయులకు భాష పై పట్టు ఉంటే విద్యార్థులకు భావాన్ని సులభంగా వ్యక్తం చేయవచ్చని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు నిత్యం కొత్త కొత్త అంశాలను తెలుసుకొని, విద్యార్థులకు పాఠశాలల్లో బోధించాలని తెలిపారు. చదువుతోపాటు జీవితంలో సమాజం పట్ల, తల్లిదండ్రుల పట్ల ఏ విధంగా బాధ్యతగా వ్యవహరించాలో ఉపాధ్యాయులు నేర్పించాలని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి డాక్టర్ ఎం.వి.ఆర్ కృష్ణాజి, విద్యా విభాగం కన్వీనర్ డాక్టర్ ఎవి రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మిరియాల కష్ణారావు, జిల్లా కోశాధికారి షిణగం శివాజీ, సమతా విభాగం అధ్యక్షురాలు యు.శాంతి కుమారి, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



జెవివి సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ మాణిక్యంనాయుడు



యోగా చేస్తున్న కమిషనర్ నల్లనయ్య, సిబ్బంది, స్థానిక ప్రజలు

యోగా పట్ల ప్రజల్లో చైతన్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యోగా పట్ల ప్రజల్లో సంపూర్ణ చైతన్యం తీసుకురావడమే యోగాంధ్ర నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పాల్ నగర్ జంక్షన్ వద్ద యోగాసనాలు వేసే ప్రక్రియలు జరిగాయి. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఇందుమతి అందరితోనూ యోగాసనాలు వేయించారు. అనంతరం ప్రజలతో ఆర్ అండ్ బి జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో యోగాంధ్ర 2025 కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా జరుగుతోందన్నారు. ప్రతిఒక్కరూ యోగా చేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని చేపట్టనున్న బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయుష్ అధికారి ఆనందరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వరరావు, టిపిఆర్ఒ సింహాచలం, సిటీమిషన్ మేనేజర్ సన్యాసిరావు, డ్వాక్రా సంఘ మహిళలు, తైక్వాండో క్రీడాకారులు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు టివి రమణ

లేబర్ కోడ్‌లను ఎత్తివేయాలి

ప్రజాశక్తి- భోగాపురం

కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను ఎత్తివేయాలని సిఐటియు జిల్లా నాయకులు టివి రమణ డిమాండ్ చేశారు. జులై 9న జరగబోయే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ స్కీం వర్కర్లు, కార్మికులతో భోగాపురంలో శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టివి రమణ మాట్లాడుతూ లేబర్ కోడ్ లు ద్వారా పెట్టుబడిదారులకు లాభం చేకూర్చి కార్మికులను అణచివేయడం తప్ప మరొకటి కాదన్నారు. ఈనేపథ్యంలో తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సదస్సులో సిఐటియు నాయకులు బత్సల సూర్యనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు అనిత, పెద్ది లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో విఆర్‌ఎల సంఘం నాయకులు జి.అప్పారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఆర్‌ఎలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్‌చేశారు. లేకుంటే జులై 9న సమ్మె చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా విఆర్‌ఎల సంఘం నియోజకవర్గ సమన్వయ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా జి.అప్పారావు, సభ్యులుగా జె.సూర్యారావు, ఆర్.అప్పారావు, కె.రాజారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.గోపాలం, విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్షులు పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.